# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..

సంపుటి : 3 సంచిక : 323 శుక్రవారం 10 ఏప్రిల్ 2026 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com


## వేగంగా ఫ్యూచర్ సిటీ
# అడుగులు



- కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీకి సంబంధించి ఊరట కల్పించిన ఎన్జీటీ చెన్నై ధర్మాసనం
- పర్యావరణ అనుమతులు లేకుండానే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని పిటిషన్
- హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ మీదుగా ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైన సంగతి తెలిసిందే
- ఓఆర్ఆర్ కొంగరకలాన్ నుంచి ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి వద్ద రీజినల్ రింగు రోడ్డు వరకు ఈ ప్రాజెక్టును చేపట్టారు

హైదరాబాద్

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై స్టే ఇచ్చేందుకు చెన్నై ఎన్జీటీ నిరాకరించింది. పర్యావరణ అనుమతులు లేకుండానే ఫ్యూచర్ సిటీని ప్రభుత్వం చేపడుతోందని పిటిషనర్ వాదించగా.. అది ఇంకా తొలి దశలోనే ఉందని.. ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని ప్రభుత్వం తరఫు లాయర్ వాదించారు. అయితే నిబంధనలను ఉల్లంఘించి ఎక్కడా పనులు చేయబోమని ఎన్జీటీకి ప్రభుత్వం తరఫు లాయర్ వివరించారు. దీంతో ఈ పిటిషన్‌పై విచారణను ఎన్జీటీ వాయిదా వేసింది.తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీకి సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) చెన్నై ధర్మాసనం.. ఊరట కల్పించింది. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు నిర్మాణంపై దాఖలైన పిటిషన్‌పై స్టే ఇచ్చేందుకు ఎన్జీటీ చెన్నై బెంచ్ నిరాకరించింది. దీంతో రేవంత్ రెడ్డి సర్కార్‌కు రిలీఫ్ కలిగింది. ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నోటిఫికేషన్–2006లో వెల్లడించిన ప్రకారం.. పర్యావరణ అనుమతులు లేకుండానే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం - మిగతా3లో



## నారీశక్తిని బలోపేతం చేద్దాం

- మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని మోదీ
- ఏప్రిల్ 16 నుంచి చారిత్రక పార్లమెంటు సెషన్
- లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు
- బ్లాగ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు
- ప్రభుత్వ, పార్టీలు, వ్యక్తులకు అతీతంగా సహకరించాలి

## రేషన్ దుకాణాల వద్ద
# నో స్టాక్ బోర్డులు

- మూడు నెలల బియ్యంపై లబ్ధిదారుల్లో భయంభయం
- 3 నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేపడుతోన్న ప్రభుత్వం
- బియ్యం చౌకధరల దుకాణాల్లో నిల్వ చేసుకునే సౌకర్యం లేకపోవడంతో సమస్యలు
- తొలి విడత కోటా అయిపోవడంతో నో స్టాక్ బోర్డులు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 3 నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేపడుతోన్న విషయం తెలిసిందే. అయితే రేషన్ బియ్యం పంపిణీకి అనుగుణంగా బియ్యం సరఫరా ఉండటం లేదని లబ్ధిదారులు, డీలర్లు అంటున్నారు. 3 నెలల కాలానికి సంబంధించిన బియ్యం చౌకధరల దుకాణాల్లో నిల్వ చేసుకునే - మిగతా3లో



## సీట్లు పెంచకుండా మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి

- కేంద్రానికి స్టాలిన్ డిమాండ్
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కోసం 2011 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే ఉత్తర భారత రాష్ట్రాల సీట్లు దాదాపు రెట్టింపు అవుతాయని ఆందోళన



## నౌకల్లోనే ఉండండి, బయటికి రావద్దు..

- హర్మూజ్‌లోని భారత నావికులకు కేంద్రం అడ్వయిజరీ
- భద్రతాకారణాల దృష్ట్యా ఇరాన్ దాని పరిసర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులు సున్నితమైన ప్రదేశాలకు దూరంగా ఉండాలి
- అవసరమైతే తప్ప బయటకు రావద్దు

## బీఆర్ఎస్ పార్టీలో
# చేరడం పక్కా

- రేవంత్ రెడ్డి పాలన కన్నా కేసీఆర్ పాలన బాగుంది
- నష్టపోయిన ప్రతి రైతును గత ప్రభుత్వం ఆదుకుంది
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయింది
- కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను, నిరుద్యోగులను ఏనాడు పట్టించుకోలేదు
- ప్రజలు కేసీఆర్ 10 సంవత్సరాల పాలన తర్వాత బెటర్ పాలన కావాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి



జగిత్యాల

రేవంత్ రెడ్డి పాలన కన్నా కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. 10 సంవత్సరాల కేసీఆర్ పాలనకు కాంగ్రెస్ పాలన తిరోగమనంలో నడుస్తుందని వెల్లడించారు. గురువారం జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. నష్టపోయిన ప్రతి రైతును గత ప్రభుత్వం ఆదుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను, నిరుద్యోగులను ఏనాడు పట్టించుకోలేదు. ప్రజలు కేసీఆర్ 10 సంవత్సరాల పాలన తర్వాత బెటర్ పాలన కావాలని - మిగతా3లో

## బెంగాల్‌లో మళ్లీ అదే రిపీట్ అవుద్ది

- గత ఎన్నికల్లో జరిగిన ఆ అద్భుతం ఈ సారి భవానీపూర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పునరావృతం అవుతుంది
- "రాష్ట్రంలోని ప్రతికూల పరిస్థితులను ఓడించాలని బెంగాల్ ప్రజలు నిర్ణయించారు అని నేను చూశాను
- ఈ ఉత్సాహం, ఉత్తేజంలోనే బీజేపీ విజయం కనిపిస్తోంది.
- మమతా బెనర్జీ ప్రభుత్వంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు





## లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడి

- 250 మందికిపైగా మృతి
- కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన వెంటనే లెబనాన్‌పై ఈ దాడులు
- తమ మిత్రపక్షాలపై కూడా దాడులు చేయకూడదని ఇరాన్ డిమాండ్ చేయగా.. ఇజ్రాయెల్ అంగీకరించలేదు

## ఐపీఎల్ ప్రిడిక్షన్ పేరిట
# బెట్టింగ్ ఉచ్చు

- సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల మాటలు నమ్మొద్దు!
- సోషల్ మీడియాలో ఊదరగొడుతూ నిలువునా ముంచేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లు
- క్రికెట్ మ్యాచ్ ముందస్తు అంచనాలు వంద శాతం కచ్చితత్వంతో ఉంటాయని బురిడీ
- బెట్టింగ్ యాప్‌లపై హైదరాబాద్ నగర పోలీసుల నిఘా



హైదరాబాద్

ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) ప్రిడిక్షన్ పేరుతో కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు ఆన్‌లైన్‌లో ఊదరగొడుతూ, అమాయకపు యువతను నిలువునా ముంచేస్తున్నారు. మ్యాచ్ మొదలైన దగ్గర నుంచి టాస్ ఎవరు గెలుస్తారు ఏ జట్టు విజయం సాధిస్తుందో ముందే అంచనాలు చెబుతాయంటూ కొన్ని వెబ్‌సైట్లు, యాప్‌లకు విస్తృత ప్రచారం చేస్తూ యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారు. కష్టపడకుండా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించే పేరుతో ఇప్పటికే కొన్ని సంస్థలు ఆన్‌లైన్ యాడ్స్‌తో ముంచెత్తుతుంటే, కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా ఆ నేరంలో పాలు పంచుకుంటున్నారు. ఫలానా వెబ్‌సైట్, యాప్‌లు ఐపీఎల్‌లో జరిగే ముందస్తు అంచనాలు వంద శాతం కచ్చితత్వంతో ఉన్నాయంటూ విరివిగా తప్పుడు ప్రచారం కల్పిస్తున్నారు. దీన్ని నమ్మి స్థాయికి మించి పందెం కాస్తూ ఎందరి జీవితాలో ఆగం అవుతున్నాయి. రాజధానిలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లకు వచ్చే బెట్టింగ్‌లో డబ్బు నష్టపోయే ఫిర్యాదుదారుల్ని ప్రశ్నించినప్పుడు - మిగతా3లో



## స్త్రీలనే కాదు- పురుషులను కూడా అనుమతించని ఆలయాలున్నాయి

- శబరిమల అంశంపై సుప్రీంకోర్టులో మూడో రోజు కొనసాగుతోన్న విచారణ
- కేంద్రం తరఫున వాదనలు సమర్పించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా
- దేశంలోని కొన్ని ఆలయాల్లో పురుషులకు అనుమతి లేదని పేర్కొన్న కేంద్రం

# నారీశక్తిని బలోపేతం చేద్దాం

నారీశక్తిని బలోపేతం చేద్దాం అంటూ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం ఒక బ్లాగ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తెచ్చేందుకు ఉద్దేశించిన బిల్లు ఆమోదానికి ఏప్రిల్ 16 నుంచి చారిత్రక పార్లమెంటు సెషన్ జరగబోతోందని ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు (ఏప్రిల్ 18 వరకు) ఈ సెషన్ వేదికగా చేయనున్న శాసనపరమైన ప్రక్రియల గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే నారీశక్తి వందన్ అధినియం (106వ రాజ్యాంగ సవరణ చట్టం - 2023) కోట్లాది భారతీయ వనితల ఆకాంక్షలకు ప్రతిరూపమని మోదీ అభివర్ణించారు. మహిళలు పురోగమిస్తేనే సమాజం పురోగమిస్తుందనే భారతీయ నాగరికతా స్ఫూర్తికి ఎప్పటినుంచో మార్గదర్శకంగా ఉన్న ఒక సూత్రానికి ఈ చట్టం ప్రతీకగా నిలుస్తుందన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం, పార్టీలు, వ్యక్తులకు అతీతంగా ఐక్యతా భావనతో, బాధ్యతాయుత వైఖరితో సహకారాన్ని అందించాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. నారీశక్తి బలోపేతానికి ఈ చట్టం అమలు అత్యవసరమని ఆయన చెప్పారు. దేశ ప్రయోజనాలు, భావితరాల బంగారు భవిష్యత్, ప్రజాస్వామిక - రాజ్యాంగ విలువల బలోపేతం కోసం మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం అవసరమన్నారు. దేశ వికాసానికి దోహదపడే నారీశక్తిని బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మోదీ పేర్కొన్నారు. ఒక ప్రజాస్వామిక వ్యవస్థలోని నిజమైన బలం, కాలక్రమేణా పరిణామం చెంది మరింత సమ్మిళితం కాగల దాని సామర్థ్యంలోనే దాగి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మహిళల భాగస్వామ్యంతో జన జీవితాలు సుసంపన్నం

భారత జనాభాలో సగం మంది ఉన్న మహిళలు అందిస్తున్న సేవలు అపారమైనవని, అమూల్యమైనవని ప్రధాని కొనియాడారు. నేడు ప్రతీ రంగంలోనూ భారతీయ మహిళలు అద్భుతమైన విజయాలను సాధిస్తున్నారని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి స్టార్టప్‌ల దాకా, క్రీడల నుంచి సాయుధ దళాల దాకా, సంగీతం నుంచి కళల దాకా భారతదేశ ప్రగతిలో మహిళలు అగ్రగామిగా నిలుస్తున్నారని మోదీ పేర్కొన్నారు. గత కొన్ని దశాబ్దాలలో భారతీయ మహిళలకు



విద్యా వనరులు, ఆరోగ్య వసతులు, ఆర్థిక సదుపాయాలను పెద్దఎత్తున అందుబాటులోకి తెచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వాటన్నింటి ఫలితంగా ఆర్థిక, సామాజిక వ్యవహారాల్లో మహిళల భాగస్వామ్యం చాలావరకు పెరిగిందన్నారు. కానీ రాజకీయాలు, చట్టసభల్లో మాత్రం మహిళల ప్రాతినిధ్యం జనాభాకు సరిసమాన స్థాయిలో లేకుండా పోవడం అనేది దురదృష్టకర అంశమని ప్రధాని తెలిపారు. ఒకవేళ ప్రభుత్వ పాలనలో, నిర్ణయాలలో మహిళల భాగస్వామ్యం పెరిగితే వారు తమ అనుభవాలు, ఆలోచనలతో జన జీవితాలను సుసంపన్నం చేసి, పాలనలో నాణ్యతను పెంచుతారని మోదీ చెప్పారు.

**వాయిదా వద్దు- 2029 నుంచే అమలు**

"2029లో జరగనున్న లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్ బిల్లును అమల్లోకి తేవడం తప్పనిసరి. ఈ బిల్లు అమలుపై పార్లమెంటు ఆమోదాన్ని పొందే ప్రయత్నాన్ని వాయిదా వేయడం అంటే, అసమానతలను ఇంకా పొడిగించడమే అవుతుంది. భారత్ వికసిస్తున్న ఈ తరుణంలో, దేశ జనాభాలో సగ భాగం ఉన్న మహిళలకు చట్టసభల్లో అవకాశాలు పెరగాలి. తద్వారా మహిళా వికాసంపై భారత్ నిబద్ధతకు గౌరవం లభిస్తుంది. భారత ప్రజాస్వామ్యంలో మహిళలకు అవకాశాలను పెంచడం ద్వారా దాన్ని మరింత జవాబుదారీగా, భవిష్యత్ అవసరాలను తీర్చేదిగా తీర్చిదిద్దుకుందాం. ప్రజాస్వామిక సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు గత కొన్ని దశాబ్దాల్లో నాటి ప్రభుత్వాలు కూడా చాలానే ప్రయత్నాలు చేశాయి. ఇందుకోసం వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. బిల్లుల ముసాయిదాలను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కానీ వాటికి ఎన్నడూ పార్లమెంటు ఆమోదం లభించలేదు. కానీ చట్టసభల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే అంశంపై అన్ని రాజకీయ పక్షాల్లో ఏకాభిప్రాయం అదే విధంగా కొనసాగింది. ఈక్రమంలోనే 2023 సెప్టెంబరులో నారీశక్తి వందన్ అధినియం చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఆ చారిత్రక ఘట్టం చోటుచేసుకున్న రోజు నా జీవితంలో చాలా ప్రత్యేకమైనదిగా భావిస్తున్నాను" అని ప్రధాని మోదీ బ్లాగ్‌లో రాశారు.

**సమసమానత్వ భావనకు ఆచరణ రూపు**

"మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అనేవి భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైన అంశం. దీన్ని అమల్లోకి తెస్తే మన దేశం సమసమానత్వ భావనకు ఆచరణ రూపును ఇచ్చినట్టు అవుతుంది. భారత రాజ్యాంగ స్ఫూర్తికి ఆచరణ రూపాన్ని ఇవ్వడం మనందరి బాధ్యత. దేశ భవిష్యత్ నిర్మాణంలో పౌరులు అందరికీ సరిసమాన భాగస్వామ్యాన్ని, ప్రాతినిధ్యాన్ని కల్పించడం తప్పనిసరి. ఈవిషయంలో ఇక ఏమాత్రం జాప్యం జరగకూడదు. దీనిలో ఏ మాత్రం జాప్యం జరిగినా సమానత్వ భావనకు, ప్రజాస్వామిక సమ్మిళిత తత్వానికి విఘాతం కలుగుతుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.


**పండుగల సీజన్‌లోనే చారిత్రక పార్లమెంటు సెషన్**

"మన దేశంలో త్వరలోనే పండుగల సీజన్ మొదలుకాబోతోంది. అసోంలో రంగోలీ బిహు, ఒడిశాలో మహా బిషుబ పనా సంక్రాంతి, బంగాల్‌లో పోయిల బైశాఖ్, కేరళలో విషు, తమిళనాడులో పుథాండు, పంజాబ్ - ఉత్తరాది రాష్ట్రాల్లో బైశాఖి పర్వదినాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ వేడుకల్లో భాగం కానున్న యావత్ దేశ ప్రజలకు నా తరఫున శుభాకాంక్షలు. ఈ పర్వదినాలు అందరి జీవితాల్లో ఆనందకాంతులను నింపాలని నేను కోరుకుంటున్నాను. ఏప్రిల్ 11న మహాత్మా పూలే 200వ జయంతి, ఏప్రిల్ 14న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి జరగనున్నాయి. ఏప్రిల్ 16న చారిత్రక పార్లమెంటు సెషన్ మొదలుకానుంది. ఇది మన దేశ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లను ప్రసాదిస్తుంది. రాజ్యాంగ విలువలకు, సమసమానత్వ భావనకు, ప్రజాస్వామిక స్ఫూర్తికి ఊపిరులు ఊదే నిర్ణయాన్ని ఆ మూడు రోజుల పార్లమెంటు సెషన్‌లో తీసుకోబోతున్నాం" అని ప్రధాని మోదీ వెల్లడించారు.

## స్త్రీలనే కాదు- పురుషులను కూడా
# అనుమతించని ఆలయాలున్నాయి

శబరిమల ఆలయంలో 10 నుంచి 50 ఏళ్ల వయస్సు మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్రం గట్టిగా సమర్థించింది. 2018 నాటి సుప్రీంకోర్టు తీర్పు పురుషులు ఉన్నతులని, మహిళలు తక్కువ స్థాయి వారన్న ఆపోహ ఆధారంగా ఇచ్చినట్లు అభిప్రాయపడింది. ఇది కేవలం మతపరమైన విశ్వాసాలకు సంబంధించిన విషయమని స్పష్టం చేసింది. వివిధ మతపరమైన ప్రదేశాల్లో మహిళల పట్ల వివక్షకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం కూడా విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ వాదనలు వినిపించారు. దేశంలో పలు ఆలయాల్లో పురుషులకు సైతం అనుమతి లేదని తుషార్ మెహతా తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను లిఖితపూర్వకంగా రాజ్యాంగ ధర్మాసనానికి సమర్పించారు. మన దేశంలో పురుషులకు ప్రవేశం లేని ఆలయాలు కూడా ఉన్నాయని, దేవి భగవతి టెంపుల్స్‌లో కొన్నేళ్లుగా ఇలాంటి ఆచారం కొనసాగుతోందని చెప్పారు. శతాబ్దాలుగా వస్తున్న ఆచారం ప్రకారం కేరళలోని కొట్టంకులంగర శ్రీ దేవి ఆలయంలో చమయవిళక్కు ఉత్సవం సందర్భంగా పురుషులు మహిళల్లా చీరకట్టుకుని వెళ్తారని తెలిపారు. ఈ అలంకరణలో ఇంట్లో మహిళలే వారికి సహాయం చేస్తారని పేర్కొన్నారు. మత విశ్వాసాలు పురుషుల కేంద్రకృతంగా లేదా మహిళా కేంద్రకృతంగా ఉన్నాయనే ప్రశ్న ఉత్పన్నం కాదని తుషార్ మెహతా వాదించారు. శబరిమల కేసులో ఇది భక్తుల విశ్వాసాలకు సంబంధించినదిగా చూడాలని తుషార్ మెహతా





కోర్టుకు వివరించారు. రాజ్యాంగ నైతికత ఆధారంగా కాకుండా, మతవిశ్వాసాల ప్రాతిపదికన ఈ ఆచార వ్యవహారాలను చూడాలని అదనపు సొలిసిటర్ జనరన్ కేఎం నటరాజ్ వాదించారు.

**'మతంలోని మూఢనమ్మకాలను గుర్తించే అధికారం ఉంది'**


మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో, కాదో నిర్ణయించే అధికారం, హక్కు న్యాయస్థానానికి ఉందని బుధవారం సుప్రీంకోర్టు పేర్కొంది. న్యాయమూర్తులు చట్టం విషయంలో మాత్రమే నిపుణులు, మత విషయాల్లో కాదని తెలిపింది. న్యాయస్థానాలు మత ఆచారాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేవన్న కేంద్ర వాదనకు ప్రతిస్పందనగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

**కేసు నేపథ్యం**

2018 సెప్టెంబర్‌లో శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఉన్న శతాబ్దాల నాటి ఆచారాన్ని సుప్రీంకోర్టు నిషేధించింది. ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీ చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఆ ఆచారం చట్టవిరుద్ధమని, రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించి మహిళలకు ప్రవేశం కల్పించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. 2019 నవంబర్ 14న విచారణ చేపట్టిన అప్పటి సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం 3:2 మెజారిటీతో ఈ అంశాన్ని 9 మంది సభ్యులుగల అత్యున్నత ధర్మాసనానికి బదిలీ చేసింది. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో, 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణను చేపట్టింది. ఈనెల 22 వరకు రోజువారి విచారణ జరగనుంది. ఈ ధర్మాసనంలో జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ ఉన్నారు. ఈ బెంచ్ ఆధ్వర్యంలో కేరళలోని శబరిమల ఆలయంతో సహా, వివిధ మత ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై, అలాగే వివిధ మతాల్లో ఉన్న స్త్రీ మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరుగుతోంది.

# లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడి

అమెరికా-ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు ప్రకటన వెలువడిన వెంటనే లెబనాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణులతో విరుచుకుపడింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. ఈ దాడుల్లో భారీగా ప్రాణనష్టం జరిగింది. మొత్తం 254 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో వెయ్యి మందికిపైగా గాయపడ్డారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడికి పాల్పడటంతో ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ క్రమంలోనే హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్టు ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన వెంటనే లెబనాన్‌పై ఈ దాడులు జరిగాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా తమ మిత్రపక్షాలపై కూడా దాడులు చేయకూడదని ఇరాన్ డిమాండ్ చేయగా.. ఇజ్రాయెల్ అంగీకరించలేదు. హెజ్బొల్లా చేసే దాడులను అడ్డుకొనే లక్ష్యంతో లిటాని నది వరకు బఫర్‌జోన్‌ను ఏర్పాటు చేసుకోవడానికి మార్చి 2న ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్‌లో గ్రౌండ్ ఆపరేషన్ ప్రారంభించింది. ఇప్పుడు ఆ ఆపరేషన్‌ను ఆపేందుకు ఇజ్రాయెల్ సుముఖంగా లేదు. కాల్పుల విరమణ ప్రకటన అనంతరం 10 నిమిషాల వ్యవధిలో లెబనాన్‌లోని పలు ప్రదేశాలపై ఇజ్రాయెల్ 100 ఎయిర్ స్ట్రయిక్స్ చేపట్టింది.




## 'సీట్లు పెంచకుండా మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి'

లోక్‌సభలో సీట్ల సంఖ్యను పెంచడానికి ప్రతిపాదించిన డీలిమిటేషన్ ప్రక్రియను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. దీనిని అధికార పునర్ నిర్మాణంగా అభివర్ణించిన ఆయన, నారీ శక్తి వందన అధినియంపైనా స్పందించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కోసం 2011 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే, ఉత్తర భారత రాష్ట్రాల సీట్లు దాదాపు రెట్టింపు అవుతాయని ఆరోపించారు. అయితే, అదే సమయంలో లోక్‌సభలో దక్షిణ భారత రాష్ట్రాల వాటా సుమారు 24 శాతంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్‌కు డీఎంకే వ్యతిరేకం కాదని, అయితే సభలో సీట్లను పెంచకుండా ఈ చట్టాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. "ఇది సంస్కరణ కాదు, అధికారాన్ని పునర్నిర్మించడమే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పార్లమెంటు పునాదులను క్రమపద్ధతిలో నాశనం చేస్తోంది. చర్చలకు, జవాబుదారీతనానికి ఒక చైతన్యవంతమైన వేదికగా ఉండాల్సిన పార్లమెంటు, తమ ప్రజల తరఫున మాట్లాడటానికి సభ్యులకు కనీసం సరైన సమయం కూడా లభించడంలేదు. సీట్లను పెంచాలన్న ఈ ప్రతిపాదన 'కనిష్ఠ ప్రభుత్వం- గరిష్ఠ పాలన' అనే వారి సొంత నినాదానికి పూర్తిగా విరుద్ధం. ఇది కేవలం ఖర్చును పెంచి, పన్ను చెల్లింపుదారులపై భారం మోపి, పార్లమెంటరీ పనితీరు నాణ్యతను నీరుగారుస్తుంది. భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా నిర్వచించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 స్ఫూర్తికి కూడా ఇది విరుద్ధం. రాష్ట్రాల గొంతులను నొక్కడం, అర్థవంతమైన సంప్రదింపులను దాటవేయడం ప్రజాస్వామ్యం కాదు. ఇది భారతదేశ సమాఖ్య స్వభావాన్ని దెబ్బతీస్తోంది." జనాభా నియంత్రణలో విజయం సాధించిన రాష్ట్రాలకు శిక్షగా ఈ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను అభివర్ణించారు ముఖ్యమంత్రి స్టాలిన్. "ఈ ప్రక్రియ భారతీయ జనతా పార్టీ ఆధిపత్యం ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు అనుకూలంగా మారుస్తుంది. అదే సమయంలో దక్షిణ భారతదేశ గొంతును అణచివేస్తుంది. సీనియర్ నాయకుడు, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య చెప్పినట్లుగా ఇది తటస్థ ప్రక్రియ కాదు. ఇది ఒక పథకం ప్రకారం జరుగుతున్న రాజకీయ పునర్ నిర్మాణం. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాలు దాదాపు రెట్టింపు ప్రయోజనం పొందనున్నాయి. అయితే, దక్షిణాది వాటా మాత్రం సుమారు 24 శాతం వద్ద నిలిచిపోయింది. జనాభా నియంత్రణలో విజయం సాధించినందుకు తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ వంటి రాష్ట్రాలను ఇది శిక్షించడం తప్ప మరేమీ కాదు. సిద్దరామయ్య, పినరయి విజయన్, రేవంత్ రెడ్డితో సహా దక్షిణాది ముఖ్యమంత్రులు ఇది సమాఖ్యవాదాన్ని వక్రీకరించి, కొన్ని ప్రాంతాల్లో అధికారాన్ని కేంద్రీకరిస్తుందని హెచ్చరించారు." అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నారీ శక్తి వందన్ అధినియమ్‌కు సవరణ తీసుకురావడాన్ని స్టాలిన్ ప్రశ్నించారు. ఇది కేవలం ఎన్నికల లబ్ధి కోసం చేస్తున్న రాజకీయ ఎత్తుగడ అని ఆరోపించారు. "ఈ సమయం తీవ్రమైన అనుమానాలను రేకెత్తిస్తోంది. రాష్ట్ర ఎన్నికల మధ్యలో తీవ్ర ప్రభావం చూపే నిర్ణయాన్ని ఎందుకు ముందుకు తీసుకువచ్చారు 2024 పార్లమెంట్ ఎన్నికలకు ముందు మహిళా ఓటర్లను ప్రభావితం చేయడానికి గతంలో చేసిన ప్రయత్నాల మాదిరిగానే, ఇప్పుడు కూడా ఇది మరో రాజకీయ ఎత్తుగడని నిస్సందేహంగా చెబుతున్నాను. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను మేము గట్టిగా సమర్థిస్తున్నాం. దీనికి మేము సంపూర్ణ మద్దతు ఇస్తాం. కానీ సీట్లను పెంచకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించిన రాష్ట్రాలను శిక్షించకుండా దీనిని అమలు చేయాలి. మీ ఉద్దేశం నిజాయితీగా ఉంటే దీనిని అమలు చేయడానికి ఏదీ అడ్డురాదు." అని స్టాలిన్ అన్నారు.

## నౌకల్లోనే ఉండండి, బయటికి రావద్దు..



హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన భారత నావికులకు కేంద్రం అత్యవసర అడ్వయిజరీ జారీచేసింది. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా నౌకల నుంచి బయటకు రావద్దని సూచించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఒక ప్రకటన విడుదలచేసింది. భద్రతాకారణాల దృష్ట్యా ఇరాన్ దాని పరిసర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులు సున్నితమైన ప్రదేశాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నది. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని సూచించింది. ఎప్పటికప్పుడు భారత రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలని కోరింది. నౌకలలో ఉన్న నావికులు వాటిలోనే ఉండాలని పేర్కొన్నది. అప్రమత్తంగా ఉంటూ.. అధికారులు జారీచేసే సూచనలను పాటించాలని కోరింది. కంపెనీ ప్రతినిధులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలని సూచించింది. దాదాపు 40 రోజుల భీకర దాడుల తర్వాత ఇరాన్-అమెరికా మధ్య రెండు రోజుల క్రితం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయినప్పటికీ పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తొలగిపోలేదు. అయితే ఇంతలో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయడం మరోసారి ఉద్రిక్తతలకు దారితీసింది. దీనిపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఇరాన్ హర్మూజ్‌ను మరోసారి మూసివేసింది. దాంతో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా తయారైంది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ భారత నావికులకు అడ్వయిజరీ జారీచేసింది.

## బెంగాల్‌లో మళ్లీ అదే రిపీట్ అవుద్ది



హాల్దియా: పశ్చిమ బెంగాల్ ఎన్నికల వేళ సీఎం మమతా బెనర్జీ ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. త్వరలోనే బెంగాల్‌లో మార్పుల రాబోతుందని చెప్పారు. మోదీ గురువారం పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతా బెనర్జీపై పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి సాధించిన విజయాన్ని మోదీ ప్రస్తావించారు. గత ఎన్నికల్లో జరిగిన ఆ అద్భుతం ఈ సారి భవానీపూర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. "రాష్ట్రంలోని ప్రతికూల పరిస్థితులను ఓడించాలని బెంగాల్ ప్రజలు నిర్ణయించారు. అని నేను చూశాను. ఈ ఉత్సాహం, ఉత్తేజంలోనే బీజేపీ విజయం కనిపిస్తోంది. ఇది మార్పును తీసుకువచ్చే తుపాను. ఇది టీఎంసీ సర్కారుకు వీడ్కోలు. ఐదు సంవత్సరాల క్రితం మేదినిపూర్, నందిగ్రామ్ మార్పునకు మార్గాన్ని చూపాయి. ఇప్పుడు మొత్తం పశ్చిమ బెంగాల్ అదే దారిలో నడవడం ప్రారంభించింది. ఇతర రాష్ట్రాలు ఆర్థికంగా వేగంగా ఎదుగుతున్నాయి. టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డంకులు సృష్టించింది. బెంగాల్‌లో ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కాదు. బెంగాల్‌ను అభివృద్ధి వైపుగా తీసుకెళ్లడానికి పునాదిని శక్తిమంతంగా వేసే ఎన్నికలు ఇవి. టీఎంసీ సర్కారును గద్దె దించడం అవసరం. ఇప్పుడు భారత్ వేగంగా పురోగమిస్తోంది. దేశంలో వృద్ధి వేగవంతంగా ఉందంటే అనేక రాష్ట్రాలు ముందుకు సాగుతున్నాయి. కానీ దేశం ముందుకు వెళ్తుండగా, టీఎంసీ సర్కార్ బెంగాల్‌ను వెనక్కి నెడుతోంది" అని ప్రధానమంత్రి అన్నారు.

**చొరబాటుదారుల పరిశ్రమలు పెరిగాయి..**

ఒకప్పుడు భారత పురోగతికి పునాది వేసిన తయారీ, వాణిజ్యాన్ని బలపరిచిన బెంగాల్‌ను టీఎంసీ అన్ని అభివృద్ధి సూచికల్లో దిగజార్చిందని మోదీ చెప్పారు. 'ఈ పరిస్థితి మేదినిపూర్, హాల్దియా ప్రజల కంటే ఎవరికి బాగా ఎవరు తెలుసు? శతాబ్దాల క్రితమే చారిత్రక తమ్రలిప్త (ఖుఎత్ఖుశ్రీఅజ్ఞ్ఖు ఖఅఅస్త్రుశీఎ)తో వాణిజ్యం జరిగిన పోర్ట్ నగరం. హాల్దియా ఆధునిక భారతదేశంలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రాల్లో ఒకటి. కానీ ఇటీవల దశాబ్దాల్లో హాల్దియాలో కర్మాగారాలు మూతపడ్డాయి. ఒకప్పుడు దేశం నలుమూలల నుంచి ప్రజలు హాల్దియాకు వచ్చేవారు. ఇప్పుడు ఇక్కడి యువత ఉద్యోగాల కోసం అండమాన్, ఒడిశాకు వలస వెళ్తున్నారు. టీఎంసీ సర్కార్‌లో చొరబాటుదారుల పరిశ్రమలు మాత్రమే పెరిగాయి. నకిలీ పత్రాలు తయారు చేయడం, పశువుల అక్రమ రవాణా వంటి రంగాలు అభివృద్ధి చెందాయి" అని ఆయన అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో 294 స్థానాలకు ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరుగుతాయి. ఓట్ల లెక్కింపు మే 4న ఉంటుంది.

# బీఆర్ఎస్ పార్టీలో చేరడం పక్కా

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు. కాంగ్రెస్‌కు ప్రచార ఆర్భాటాలు తప్ప, ప్రజాహితంగా కార్యక్రమాలు నిర్మాణాత్మకంగా అమలు చేయలేకపోవడం వల్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. దీని ద్వారానే ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో పోల్చుకుంటే ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన నాయకుడు కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కల సాకారమైందని అన్నారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలనుకుంటున్నారని తెలిపారు.బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. దీనికి కార్యరూపం ఏవిధంగా ఉండాలనేది కేటీఆర్ నిర్ణయిస్తారని,దానికి అనుగుణంగా ముందుకెళతానని పేర్కొన్నారు.

**ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి మాట్లాడే నాయకుడు జీవన్ రెడ్డి : కేటీఆర్**

ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని కేటీఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్, జీవన్ రెడ్డికి దశాబ్దాలకుపైగా పరస్పర గౌరవం, స్నేహం ఎప్పడి నుంచో ఉంది. రెండు సందర్భాల్లో నా కండ్ల ముందు జరిగినవి గుర్తొస్తున్నాయన్నారు.

2014 జూన్ 2న కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో వారి మొట్టమొదటి అధికారిక ప్రకటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే మొదలైంది. ఆ రోజు





ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక ఆడిటోరియంలో మీటింగ్ జరిగింది. జీవన్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నాయకుడు, ప్రతిపక్షానికి సంబంధించిన శాసనసభ్యులు.. కానీ కేసీఆర్ స్వయంగా ముందు జీవన్ రెడ్డికి మైక్ ఇవ్వండి అని చెప్పివారి మైక్ అందిస్తే వారు నేరుగా అభినందనలు చెప్పి జగిత్యాల ప్రజల తరపున నేను మిమ్మల్ని ఒకటి అడగ దలచుకున్నా బోర్నపల్లి గ్రామానికి సంబంధించి ఒక బ్రిడ్జి కావాలని ఒక్క మాట చిన్నగా అడిగారు. అప్పుడే మేం కొత్తగా మంత్రులైనం. కేసీఆర్ ఎట్లా స్పందిస్తరు చూస్తా ఉన్నం. సాధారణంగా చూస్తాం.. పరిశీలిస్తాం. అని చెప్పొచ్చు. జీవన్ రెడ్డి మీదున్న గౌరవం, ప్రేమ ఎట్టాంటిదంటే.. కేసీఆర్ రూ.70 కోట్ల బ్రిడ్జిని అక్కడికక్కడే మంజూరు చేసి కరీంనగర్ జిల్లాలోనే మొట్టమొదటి మంజూరు చేసిన బ్రిడ్జిని ఇచ్చారన్నారు..

**కాంగ్రెస్‌లోనే కొనసాగారు..**

2014 ఎన్నికల ముందు కేసీఆర్ జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. జీవన్ రెడ్డి నిబద్ధత గల నాయకుడు.. కాంగ్రెస్‌లోనే కొనసాగారు. అసెంబ్లీలో ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి ముఖ్యంగా రైతుల చాలా గట్టిగా మాట్లాడే నాయకుడు. జగిత్యాల జిల్లాలో నిజాం షుగర్స్ చాలా ముఖ్యమైనదని.. దాన్ని ఖచ్చితంగా తెరిపించాల్సిందేనని విద్యాసాగర్ రావు, జీవన్ రెడ్డి ఇద్దరూ కొట్లాడేవారు. షుగర్ ఫ్యాక్టరీని ఖచ్చితంగా తెరిపించాల్సిందే.. మేం కూడా మాటిస్తున్నాం. కానీ పక్కనే ఉన్న మహారాష్ట్రలో (అప్పుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి) సహకార వ్యవస్థలో అక్కడి షుగర్ మిల్లులు చాలా బ్రహ్మాండంగా నడుస్తున్నయ్. టెస్కాబ్ చైర్మన్, మాజీ అధ్యక్షుడు రవిందర్ రావు కూడా ఇక్కడే ఉన్నరు. అట్లా కో ఆపరేటివ్ వ్యవస్థను బాగు చేస్తే బాగుంటది జీవన్ రెడ్డి గారు ఒకవేళ మీకు కావాలనుకుంటే ప్రభుత్వం నుంచి రూ.250 నుంచి 300 కోట్లు పెట్టేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నామని.. అవసరమైత మీరే దానికి చైర్మన్‌గా ఉండండి.. అని చెప్పి నిండు శాసనసభలో కేసీఆర్ ఆనాడు జీవన్ రెడ్డిగారికి ఎలాంటి భేషజానికి పోకుండా ఓపెన్‌గా చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. అంతకుముందు జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలికాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది.

# ఐపీఎల్ ప్రిడిక్షన్ పేరిట బెట్టింగ్ ఉచ్చు

-మొదటిపేజీ తరువాయి

ఈ ఇన్‌ఫ్లూయెన్సర్ల ఫేక్ ప్రకటనల బాగోతం బయటపడుతోంది. వీటిపై ఇటీవల దృష్టి సారించిన పోలీసులు, ఏకంగా 494 పెయిడ్ ప్రకటనలు, వాటి గురించి ప్రచారం చేస్తున్న 129 సోషల్ మీడియా ప్రొఫైళ్లు, అకౌంట్స్‌ను బ్లాక్ చేయించారు.

**అంచనాలు నమ్మితే దారుణాలు**

హైదరాబాద్? నగరంలో ఇతర సందర్భాలతో పోలిస్తే ఐపీఎల్ సమయంలో ప్రతిరోజూ రూ.వందల కోట్ల విలువ చేసే పందేలు జరుగుతున్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. బెట్టింగ్ యాప్ నిర్వాహకులు ఇన్‌ఫ్లూయెన్సర్ల ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా డబ్బు చెల్లిస్తూ, విస్తృత ప్రచారం చేయిస్తున్నాయి. దీనికితోడు కొంతమంది యువకుల్ని ఏజెంట్లుగా నియమించి యువతను లక్ష్యంగా చేసుకుని టెలిగ్రామ్‌లోనూ విస్తృతంగా ప్రకటనలు గుప్పిస్తున్నారు.

**నష్టపోతే ఆత్మహత్యలే శరణ్యం**

ప్రారంభంలో ఈ యాప్‌లు కొంతమేర లాభాలు ఇస్తూ మెల్లగా ముగ్గులోకి దించుతున్నాయి. వీటికి ఆశపడుతున్న యువత మరింత సంపాదించొచ్చనే ఉద్దేశంతో లోన్‌యాప్‌లో అప్పులు తీసుకోవడం, ద్విచక్రవాహనాలు తాకట్టు పెట్టి డబ్బు తీసుకుని మరి పందెం కాస్తున్నారు. తీరా డబ్బులు నష్టపోయాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అప్పులు తీర్చేందుకు కొందరు దొంగతనాల బాట సైతం పడుతున్నారు. కొన్నాళ్లుగా బెట్టింగ్ యాప్‌లు ఉపయోగించేవారి మీద సైబర్? క్రైం పోలీసులు గట్టి నిఘా పెడుతున్నారు. ఐపీ అడ్రస్‌లు, ఇతర టెక్నాలజీ మార్గాల్లో పందెం కాస్తున్న వారిని గుర్తిస్తున్నారు.

**అసత్య ప్రచారాలు చేస్తూ**

ఐపీఎల్ ప్రిడిక్షన్ పేరిట ఆన్‌లైన్ బెట్టింగ్ ఉచ్చు జాగ్రత్త అని పోలీసు కమిషనర్ సజ్జనార్ ట్వీట్ చేశారు. ఐపీఎల్ క్రికెట్ ఫీవర్‌ను ఆసరాగా చేసుకుని సోషల్ మీడియాలో కొందరు మోసపూరిత ప్రకటనలతో విరుచుకుపడుతున్నారన్నారు. కేవలం డబ్బు కోసం కొంతమంది ఇన్‌ఫ్లూయెన్సర్లు అసత్య ప్రచారాలు చేస్తూ సామాన్యులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టాస్ ఎవరిది! మ్యాచ్ ఏ టీమ్ గెలుస్తుంది! అని ముందే చెబుతామంటూ మిమ్మల్ని తమ ఛానెల్స్‌లో సబ్‌స్క్రైబ్ చేయించుకుని, నిలువునా ముంచే బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారని చెప్పారు. ఇలాంటి ఫేక్ ప్రిడిక్షన్ ఛానెళ్ల మాటలు నమ్మి మీ కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని సూచించారు. ఇలాంటి ప్రమోషన్ల విషయంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠినంగా వ్యవహరిస్తోందని హెచ్చరించారు. గత నెల రోజుల్లోనే 494 పెయిడ్ యాడ్స్?ను, వాటిని ప్రచారం చేస్తున్న 129 సోషల్ మీడియా ప్రొఫైళ్లను బ్లాక్ చేయించినట్లు తెలిపారు. ఈ నిఘా నిరంతరం కొనసాగుతుందన్న ఆయన బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి మోసపూరిత యాడ్స్ మీ దృష్టికి వచ్చినా లేదా మీరు మోసపోయినా, వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

# భూభారతి ఇంటిగ్రేటెడ్ పోర్టల్ రెడీ

**నిజామాబాద్ :** భూముల సమస్యలు రాకుండా ఉండేందుకు రేవంత్ సర్కార్ భూభారతి పోర్టల్ ద్వారా పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేసేందుకు రెడీ అయింది. భూముల రిజిస్ట్రేషన్ కోసం.. ముందుగా సర్వే చేసి.. అక్కడి భూమికి, రికార్డుల్లో సమాచారం సరిపోలితేనే ఇక నుంచి రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. ఇక ఒక్కసారి రిజిస్ట్రేషన్ అయిన భూమి సర్వే నంబర్లు గానీ, విస్తీర్ణం గానీ మార్చే అవకాశం లేకుండా పక్కా చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమించినా భూభారతితో వారిని గుర్తించనున్నారు.భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో ఎన్నో సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి, రికార్డుల్లో ఉన్న భూమికి అసలు పొంతన ఉండదు. ప్రభుత్వ భూములు, ఇతరుల భూమిని ఆక్రమించి ఉన్న భూముల కంటే ఎక్కువ భూములను రిజిస్ట్రేషన్లు చేసుకునే వారు ఉంటారు. ఇక క్షేత్ర స్థాయిలో ఎక్కువ భూమి ఉన్నా.. రికార్డులు సరిగా లేకపోవడం వల్ల పట్టా పాసు పుస్తకాల్లో తక్కువ భూమి రిజిస్ట్రేషన్ కావడం వంటి ఘటనలు చూస్తూనే ఉన్నాం. దీంతో రైతులు పంట పండించడం కంటే ఎక్కువగా భూరికార్డుల సవరణ కోసం అధికారుల చుట్టూ తిరగడమే ఎక్కువ అవుతోంది. ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో ఈ సమస్యలు మరిన్ని పెరిగాయని ఆరోపించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని సరిచేయడానికి భూభారతి పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు చెబుతోంది. పైలట్ ప్రాజెక్టు కింద ఈ భూభారతి ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌ను అమలు చేసేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని 5 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి.. అమలు చేసేందుకు రెడీ అయింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ఈ భూభారతి పోర్టల్ పైలట్ ప్రాజెక్టుగా గురువారం ప్రారంభమైంది.ఈ సమగ్ర భూభారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత.. నిజంగా ఉన్న భూమికి.. రికార్డుల్లో ఉన్న సమాచారం సరిగ్గా సరిపోతేనే భూ భారతి పోర్టల్లో భూమిని రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఇలా రిజిస్ట్రేషన్ అయిన తర్వాత రైతుకు పట్టాదార్ పాసు పుస్తకంతోపాటు భూధార్ నంబర్‌ను కూడా కేటాయిస్తారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్‌లో ఆ భూమికి సంబంధించిన సర్వే నంబర్లను గానీ.. విస్తీర్ణాన్ని గానీ మార్చడానికి అవకాశమే ఉండదు. రాష్ట్రంలో భూముల వ్యవస్థను పకడ్బందీగా సరిచేసేందుకు రెవెన్యూ శాఖ ఈ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది.ఇక ఈ భూభారతిలో భాగంగా సర్వే, రిజిస్ట్రేషన్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్లను కలిపి






ఒకే పోర్టల్ కిందికి తీసుకువచ్చారు. సర్వే వివరాలు.. స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న వివరాలు (22 ఎ, ఇతరత్రా), రెవెన్యూ శాఖ రికార్డుల్లో ఉన్న వివరాలు అన్నీ ఈ పోర్టల్లో అందుబాటులో ఉంచారు. మరోవైపు.. 2020 నవంబరు 2వ తేదీ నుంచి ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే అందులో ఏ సమాచారం ఉంటే దాని ఆధారంగానే భూముల రిజిస్ట్రేషన్ చేపట్టడంతో క్షేత్రస్థాయిలో భారీగా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటన్నింటినీ సరిచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది.ఈ విధానంలో భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఇక నుంచి భూమిని సర్వే చేయడం తప్పనిసరి చేశారు. ఇందు కోసం మొదట ఇంటిగ్రేటెడ్ పోర్టల్లో భూ సర్వేకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ భూమికి సంబంధించిన రెవెన్యూ దస్త్రాలు, సర్వే శాఖ వద్ద ఉన్న వివరాలతో సరిహద్దు రైతులకు సర్వేయర్లు నోటీసులు ఇస్తారు. తోటి రైతుల సమక్షంలోనే భూమిని సర్వే చేసి తహసీల్దార్లకు రిపోర్టు అందిస్తారు. ఆ తర్వాత రెవెన్యూ శాఖ.. రైతుకు సర్వే పటం జారీ చేస్తుంది. ఆ సర్వే పటం ఆధారంగా భూ భారతి పోర్టల్లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు రైతు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం క్షేత్రస్థాయిలో సర్వేలో ఎంత భూమి అయితే ఉంటుందో.. అంత భూమికే రిజిస్ట్రేషన్ చేస్తారు.రైతు చేసుకున్న దరఖాస్తుతోపాటు సర్వే పటం ఆధారంగా తహసీల్దార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కలిసి.. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తి చేసి పట్టాదార్ పాసుపుస్తకాన్ని జారీ చేయనున్నారు. దీంతోపాటు రైతుకు భూధార్ కార్డును కూడా జారీ చేస్తారు. ఆ భూదార్ కార్డులో భూమికి సంబంధించిన సమగ్ర వివరాలను పొందుపరుస్తారు. భూదార్ కార్డులో ప్రత్యేక సంఖ్య ఉండటం వల్ల దాన్ని మార్చడానికి వీలు లేకుండా చేశారు. ఈ ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో రైతులే స్వయంగా భూమి నక్షా, భూమి మార్కెట్ విలువ సహా కీలక విషయాలను తెలుసుకునే అవకాశం కల్పించారు. ఇక తమ పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కూడా కలుపుకుని.. చాలా మంది రైతులు పంట సాగు చేస్తూ ఉంటారు. ఇక అలాంటి భూములు కూడా రిజిస్ట్రేషన్ సమయంలో దొరికిపోనున్నాయి.

## రేషన్ దుకాణాల వద్ద నో స్టాక్ బోర్డులు

-మొదటిపేజీ తరువాయి

సౌకర్యం లేకపోవడం ఒక కారణం కా,గా మరోవైపు రేషన్ దుకాణంలో నిండుకున్న నిల్వల స్థానంలో కొత్త కోటా విడుదల చేసే అవకాశం లేకపోవడంతో దుకాణాల ముందు నో స్టాక్ బోర్డ్ పెట్టాల్సిన పరిస్థితి తలెత్తుతోందని డీలర్లు వెల్లడిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్, మే, జూన్ నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నారు.

**రేషన్ దుకాణాల వద్ద నో స్టాక్ బోర్డు : -**

కరీంనగర్ జిల్లాలో 566 రేషన్ దుకాణాలుండగా 3 నెలల కాలానికి 17,000 టన్నుల బియ్యం రవాణా చేయాల్సి ఉంది. జిల్లా పౌరసరఫరాల సంస్థ ఇప్పటికే 11,000 టన్నుల బియ్యం రవాణా చేసింది. జిల్లాలో 65 శాతం బియ్యం రవాణా పూర్తైంది.

ఈ రేషన్ బియ్యం వచ్చిన వెంటనే లబ్ధిదారులు పెద్ద ఎత్తున ఎగబడుతున్నారు. 3 నెలల కాలానికి బియ్యం ఏకకాలంలో తూకం వేసి ఇస్తుండటంతో కొద్దిసేపటికే నిల్వలు నిండుకుంటున్నాయి.

నిండుకున్న బియ్యం స్థానంలో కొత్తవి తీసుకురావడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు.

ప్రస్తుతం ఉన్న వాహనాలు, అదే హమాలీ కార్మికులతో 3 నెలల బియ్యం రవాణా చేయాల్సి వస్తోందని, దీంతో వారు ఏబీసీడీ ఇలా చౌకధరల దుకాణాలను వర్గీకరించి రోజుకో ప్రాంతానికి సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఇలా చేస్తుండటంతో ముందుగా రేషన్? బియ్యం నిల్వలు నిండుకున్న దుకాణాలకు 3 రోజులు అవుతున్నా రావడం లేదని తెలుస్తోంది. దీంతో లబ్ధిదారులు ఆ రేషన్? దుకాణాల వద్దకు వచ్చి నో స్టాక్ బోర్డు చూసి వెనుదిరుగుతున్నారని సమాచారం.

నో స్టాక్ బోర్డులు : చౌకధరల దుకాణాలు అద్దెకు తీసుకునే సమయంలో వారి కోటా సామర్థ్యానికి అనుగుణంగా దుకాణాలను అద్దెకు తీసుకున్నారు. ప్రభుత్వం 3 నెలల కాలానికి బియ్యం ఏకకాలంలో పంపిణీ చేపడుతుండటంతో రేషన్ దుకాణాలు సరిపోవడం లేదని అంటున్నారు. నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటంతో 3 నెలల బియ్యం నిల్వ చేయలేకపోతున్నారని అన్నారు. దీంతో పాటు రేషన్ బియ్యం నిండుకోవడంతోనే నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## వేగంగా ఫ్యూచర్ సిటీ అడుగులు

-మొదటిపేజీ తరువాయి

సన్నాహాలు చేస్తోందని.. హైదరాబాద్ కొంపల్లికి చెందిన డాక్టర్ దొంతి నర్సింహా రెడ్డి.. ఎన్జీటీలో పిటిషన్ వేయగా.. తాజాగా విచారణ జరిపింది. దాదాపు 30 వేల ఎకరాల్లో ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును నిర్మించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని పిటిషనర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు నిర్మాణంపై స్టే విధించాలని పిటిషనర్ డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి కోరారు. అదే సమయంలో పర్యావరణ అనుమతులు లేకుండా ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు అభివృద్ధి పనులు చేపట్టడం చట్ట విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఇక ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డి వాదనలు వినిపించారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించి.. ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు గానీ, అభివృద్ధి కార్యక్రమాలు గానీ ప్రారంభించలేదని ప్రభుత్వం తరఫు లాయర్ వివరించారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో చట్టవిరుద్ధంగా.. నిబంధనలను అతిక్రమించి.. ఎలాంటి పనులు చేపట్టబోమని హామీ ఇచ్చారు. ఇక త్వరలోనే పర్యావరణంతోపాటు అన్ని రకాల అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఇరు వైపులా వాదనలు విన్న చెన్నై ఎన్జీటీ బెంచ్.. ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు ఇంకా ప్రారంభం కానందున అనుమతులు తీసుకునేందుకు ఇంకా సమయం ఉందని పేర్కొంటూ.. దీనిపై స్టే ఇచ్చేందుకు నో చెప్పింది. ఇక పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను జూన్ 9వ తేదీకి వాయిదా వేసింది.

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ మీదుగా ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఓఆర్ఆర్ కొంగరకలాన్ నుంచి ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి వద్ద రీజినల్ రింగు రోడ్డు వరకు ఈ ప్రాజెక్టును చేపట్టారు. అయితే ఈ కొత్త రహదారి నిర్మాణం చుట్టూ న్యాయవివాదాలు ముసురుకుంటున్నాయి. ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు భూసేకరణ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. రోడ్డు నిర్మాణ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారంటూ30 మంది రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. యాచారం మండలం కుర్మిద్ద, కడ్తాల్ మండలం కడ్తాల్, ముద్విన్, ఆమన్‌గల్ మండలం ఆకుతోటపల్లి గ్రామాల్లో మొత్తం 554.34 ఎకరాల సేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. అయితే.. భూసేకరణ, పునరావాసం చట్టం-2013లో పేర్కొన్న తప్పనిసరి నిబంధనలను అధికారులు తుంగలో తొక్కారని వారు ఆరోపించారు. ముఖ్యంగా నిర్వాసిత రైతుల నుంచి అభ్యంతరాలను తీసుకోవాల్సి ఉండగా.. ఆ ప్రక్రియను మొక్కుబడిగా పూర్తి చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు.తమ అభ్యంతరాలను అకారణంగా తిరస్కరించారని ఇది చట్టవిరుద్ధమని, ఏకపక్షమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 61.24 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ భూముల నుంచి తమను బలవంతంగా ఖాళీ చేయించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌పై వాదనలు విన్న జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ పిటిషన్‌పై విచారణ జరిపి వాస్తవ పరిస్థితులపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మొత్తం 554.34 ఎకరాల్లో సుమారు 200 ఎకరాల భూమి వివాదంలో ఉందని.. మిగిలిన భూమికి సంబంధించి 26 ఎకరాలకు ఇప్పటికే పరిహారం అవార్డులు జారీ చేశామని వెల్లడించారు. ప్రాజెక్టు ప్రాముఖ్యత దృష్ట్యా భూసేకరణపై స్టే ఇవ్వవద్దని ఆయన కోర్టును కోరారు. అలాగే.. రైతులకు పరిహారం చెల్లించే వరకు వారిని భూముల నుంచి ఖాళీ చేయించబోమని ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు. ఈ హామీని పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. తదుపరి విచారణను సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

## సర్కారీ కొలువుల్లేకపోయినా...
## భారీగా ఉద్యోగాలు

**హైదరాబాద్ :** ఆసక్తికర లెక్కలు వెలుగు చూశాయి. తెలంగాణ రాష్ట్రం కొలువులకు కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. దేశ వ్యాప్తంగా ఉన్న ఐటీ కొలువులు మాత్రమే కాదు.. పారిశ్రామిక రంగాల విస్తరణతో పాటు.. కొత్త సంస్థలు కొలువు తీరటంతో పాటు.. సేవా రంగం భారీ ఎత్తున విస్తరిస్తున్న వేళ.. ఉపాధి కల్పనలో తెలంగాణ రాష్ట్రం దూసుకెళుతోంది. కాకి లెక్కలు కాకుండా.. ఉద్యోగులు ఎవరైనా సరే.. ఈపీఎఫ్ వో వద్ద నమోదయ్యే గణాంకాల ప్రకారం చూస్తే.. ఆశ్చర్యానికి గురి చేసే గణంకాలు తెర మీదకు వచ్చాయి. గడిచిన ఎనిమిది నెలల విషయాన్నే తీసుకుంటే.. దాదాపు 3.12 లక్షల మంది తొలిసారి ఉద్యోగాల్లో చేరినట్లుగా వెల్లడైంది. ఈ కొలువుల్లో అధిక నైపుణ్యం ఉన్న ఉద్యోగాలు మాత్రమే కాదు.. మధ్యస్థాయి కొలువులు సైతం గణనీయంగా పెరిగిన విషయం వెల్లడైంది. ఈ పెరిగిన కొలువుల్లో కీలకభూమిక పోషించింది మాత్రం హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాలే అని చెప్పాలి. ఈపీఎఫ్ వో గణాంకాల్ని పరిశీలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 55.42 లక్షల మంది పని చేస్తున్నట్లు తేలింది. ఇందులో ఒక్క హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాల్లోనే 42.8 లక్షల మంది ఉండటం గమనార్హం. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 31.39 లక్షల మంది ఉద్యోగులు ఉన్నట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంలోని అత్యధిక ప్రాంతం ఈ రెండు జిల్లాల్లోనే ఉందన్న సంగతి తెలిసిందే. గడిచిన ఐదేళ్లలో దాదాపు 7.23 లక్షల మంది కొత్తగా ఉద్యోగాల్లోకి వచ్చారు. రంగారెడ్డి జిల్లాలో 4 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. అదే సమయంలో నిజామాబాద్.. ఆదిలాబాద్ జిల్లాల్లో మాత్రం ఉద్యోగుల సంఖ్య కాస్త తగ్గింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు మధ్యకాలం) కొత్తగా వచ్చిన ఉద్యోగాలు భారీగా వచ్చాయి. గడిచిన ఐదేళ్లలో వచ్చిన ఉద్యోగాల్లో దాదాపు 30 శాతానికి పైనే ఉండటం ఆసక్తికరంగా మారింది.

# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఐరన్ లెగ్ శాస్త్రి
## నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్

**సంజయ్ కుమార్ ఎక్కడ అడుగు పెడితే అక్కడ బుగ్గే..**

**తెలంగాణ తెచ్చిన మహోన్నత వ్యక్తిగా కేసీఆర్‌పై అపారమైన గౌరవం**



**కోరుట్ల :** జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఐరెన్ లెగ్ శాస్త్రీ అని, ఆయన ఎక్కడ ఆడుగు పెడితే అక్కడ బుగ్గేనని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కోరుట్ల పట్టణంలోని ఆపార్టీ రాష్ట్ర నాయకులు అనూప్ రావు నివాసంలో గురువారం ఎర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. జగిత్యాల ఎమ్మెల్యే కాంగ్రెస్ లోకి పోలేదని చెబుతూ ఆ పార్టీలోనే కొనసాగుతున్నాడని, గతంలో బోగ శ్రావణిని పార్టీ నుంచి వెళ్లగొట్టిండని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి పెద్ద మనిషి జీవన్ రెడ్డి ఇంటి పార్టీలో చిచ్చుపెట్టి పార్టీ నుంచి సాగనంపాడని ఆరోపించారు. జీవన్ రెడ్డిని బీజేపీలోకి తీసుకువచ్చేందుకు కృషి చేశామని, కానీ ఆయన నుంచి రెస్పాన్స్ రాలేదని తెలిపారు. జీవన్ రెడ్డి తనకు అప్తులని, బీఆర్ఎస్ లోకి వెళ్తున్న జీవన్ రెడ్డికి గుడ్ లక్ టూ హిమ్ అంటూ విషెష్ తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అవగాహన లేకుండా పసుపు బోర్డుపై మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. సంజయ్ కు ఫ్రెస్టేషన్ ఎక్కువై ఆవాకులు, చవాకులు పేలుతున్నాడని దుయ్య బట్టారు. ప్రపంచవ్యాప్తంగా 80 శాతం పసుపు పంట ఇండియాలో సాగు అవుతుందన్నారు. పసుపు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం కోసమే పసుపు బోర్డు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం పసుపు ధర రూ. 16500 పలుకుతుందని తెలిపారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్తో కలిసి పని చేస్తున్నానని చెప్పుకొనే జగిత్యాల ఎమ్మెల్యే కేంద్రీయ విద్యాలయానికి స్థలాన్ని ఇప్పించడం చేతగావడం లేదన్నారు. కేంద్రీయ విద్యాలయం ఇప్పటికే నిజామాబాద్, బోధన్ లో ఏర్పాటు చేశామని, అక్కడ క్లాసులు కూడా నడుస్తున్నాయని తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే తన అభివృద్ధి, వియ్యంకుడికి బిల్లులు ఇప్పించేందుకే పార్టీ మారాడని ఆరోపించారు. తెలంగాణ తీసుకు వచ్చిన మహోన్నత వ్యక్తిగా కేసీఆర్ పై తనకు ఆపారమైన గౌరవం ఉందన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకొని ఉచిత పథకాలు అమలు చేయాలని, అప్పులు తెచ్చి కాదంటూ సీఎం రేవంత్ రెడ్డి కి చురకలంటించారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత రూ.లక్ష కోట్ల అప్పులు పెరిగాయని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఓ లిల్లీపుట్ అని, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. కల్వకుంట్ల కవిత రేవంత్ రెడ్డి స్పాన్సర్ అని, బీజేపీని అణగదొక్కేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఫలించవన్నారు. ఎస్టీ విద్యార్థులకు అందాల్సిన రూ.206 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అలసత్వంతో కేంద్రానికి రిటర్న్ అయ్యాయని తెలిపారు. కోరుట్ల, మెట్ పల్లి ప్రాంత ప్రజల అభీష్టం మేరకు ముంబాయి రైలు నడుపుతున్నామన్నారు. ప్రజలు రైలును వినియోగించుకోకుండా బస్సుల్లో వెళ్లడం సరికాదన్నారు. ముంబాయి రైలును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు నాయకులు డాక్టర్ అనూప్ రావు, రుద్ర శ్రీనివాస్, తిరుమల వాసు, కస్తూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# రేషన్ దందాపై దాగుడు మూతల విచారణ

**బియ్యం తూకంలో తరుగుపై సివిల్ సప్లయ్ ఎంక్వయిరీ**

**గల్లీలో మధ్యవర్తుల మంతనాలు.. విచారణ నీరుగార్చే ప్రయత్నాలు**



**కోల్ :** రామగుండం నగర పాలక సంస్థ 41వ డివిజన్ జవహర్ నగర్ లో గల ఓ రేషన్ దుకాణంలో బియ్యం తూకంలో తరుగు తీస్తున్నారన్న ఆరోపణలపై గురువారం సివిల్ సప్లయ్ అధికారులు విచారణ దాగుడుమూతలు విధంగా సాగింది. మధ్యాహ్నం రేషన్ దుకాణంకు వచ్చిన సివిల్ సప్లయ్ అధికారులు షాపులోని కాంటాను పరిశీలించారు. ఆ తర్వాత లీగల్ మెట్రాలజీకి సమాచారం అందించారు. అప్పటివరకు సివిల్ సప్లయ్ అధికారులు మాత్రం తామేం చేయలేమంటూ అక్కడే గల్లీలో కలియ తిరగడంతో విచారణను నీరుగార్చే ప్రయత్నం జరుగుతుందంటూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో కార్డుదారుడికి తూకంలో 4 కిలోలు తరుగు తీస్తూ మోసం చేస్తున్నాడంటూ స్థానికులు సివిల్ సప్లయ్ అధికారులకు వివరించగా, లీగల్ మెట్రాలజీ అధికారులు వస్తేనే బయట పడుతుందనీ, అప్పటి వరకు ఇక్కడే వేచి ఉంటామని సర్దిచెప్పారు. కొద్దిసేపటికే రేషన్ డీలర్ల సంఘం నాయకులు, మధ్యవర్తులు చౌకధరల దుకాణం వద్దకు చేరుకొని అధికారులతో మంతనాలు సాగించారు. సుమారు 2 గంటల పాటు సాగిన విచారణ గందరగోళంకు దారితీసింది. అసలేం జరుగుతుందో తెలియని పరిస్థితిలో స్థానికులు, ఫిర్యాదుదారులు అయోమయంకు గురయ్యారు. పత్రికలో కథనం రావడంతో అప్రమత్తమై కాంటాను సరి చేసి ఉంటారని స్థానికులు ఆరోపించారు. విచారణకు వచ్చిన సివిల్ సప్లయ్ అధికారులు కూడా ఏమి చేయాలో తెలియక ప్రక్కన గల్లీలోకి వెళ్లి ఓ ఇంటి వద్ద సేద తీరడం కనిపించింది. అప్పటికే మధ్యవర్తులతో డీలర్ తరఫున వ్యక్తులు జరిపిన మంతనాలు కొలిక్కివచ్చినట్లు తెలిసింది. మధ్యవర్తుల మంతనాలు ఫలించినట్లు తెలుస్తోంది. దీంతో కలెక్టర్ స్వయంగా విచారణకు ఆదేశించాలని స్థానికులు పట్టుబట్టారు. లీగల్ మెట్రాలజీ సిబ్బంది రాకపోయేసరికి అందరూ ఇంటిదారి పట్టారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరడం పక్కా: మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**జగిత్యాల :** రేవంత్ రెడ్డి పాలన కన్నా కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. 10 సంవత్సరాల కేసీఆర్ పాలనకు కాంగ్రెస్ పాలన తిరోగమనంలో నడుస్తుందని వెల్లడించారు. గురువారం జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. నష్టపోయిన ప్రతి రైతును గత ప్రభుత్వం ఆదుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను, నిరుద్యోగులను ఏనాడు పట్టించుకోలేదు. ప్రజలు కేసీఆర్ 10 సంవత్సరాల పాలన తర్వాత బెటర్ పాలన కావాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు. కాంగ్రెస్‌కు ప్రచార ఆర్భాటాలు తప్ప, ప్రజాహితంగా కార్యక్రమాలు నిర్మాణాత్మకంగా అమలు చేయలేకపోవడం వల్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. దీని ద్వారానే ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో పోల్చుకుంటే ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన నాయకుడు కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కల సాకారమైందని అన్నారు.రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలనుకుంటున్నారని తెలిపారు.బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.దీనికి కార్యరూపం ఏవిధంగా ఉండాలనేది కేటీఆర్ నిర్ణయిస్తారని,దానికి అనుగుణంగా ముందుకెళతానని పేర్కొన్నారు.

## సామాజిక కార్యక్రమాలు మరింతగా చేపట్టాలి



**గుర్రంపోడు :** గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్ఆర్ఐ అమెరికా ప్రధాన కార్యదర్శి నాగులవంచ నరసింహారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగులవంచ తిరుపతి రావు, నాగులవంచ పరశురామ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండాకాలంలో తీవ్ర ఉష్ణోగ్రతల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు మరింతగా చేపట్టాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీ ధనంజయ్, సర్పంచులు మారపాక శంకర్, సింగం బాలకృష్ణ, సల్వాది సత్యవతి నగేశ్, చెవ్వ రమేశ్, మాజీ సర్పంచ్, సల్వాది నగేశ్, ఉప సర్పంచ్ ఐతగోని వెంకటేశం, పార్టీ నాయకులు రామగిరి చంద్రశేఖర్ రావు, నాగులవంచ వెంకట శ్రీనివాస్ రావు, సింగం ప్రవీణ్, కామల్ల రాములు, ఐతగోని కృష్ణ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు కొత్త శ్రీనివాస్, వల్కి చంటి, కూనూరు సైదిరెడ్డి, నాగులవంచ నాగేశ్వరరావు, జక్కల సైదులు, ఐతరాజ ప్రసాద్, నీరుడు శ్రీను, ఐతరాజు నాగరాజు, పామన గుండ్ల వెంకన్న, ఉపేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, దోటి గణేష్, ఆవుల కృష్ణ, మామిడి నరేశ్, ఆవుల కుమార్, బొల్లం నరేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రాంజీ గోండ్ వర్ధంతి



**వాస్తవ నేస్తం,భీంపూర్:** మండల కేంద్రంలో గురువారం ఆదివాసీ నాయకులు రాంజీ గోండ్ వర్ధంతినీ ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర సమరంలో రాంజీ గోండ్ చేసిన త్యాగాలు అపారమణి పేర్కొన్నారు.గిరిజనుల హక్కుల కోసం పోరాడిన రాంజీ గోండ్ చరిత్రను యువత తెలుసుకోవాలని వారు తెలిపారు..ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మాజీ సర్పంచ్ మాడావి లింబాజి,పురుషోత్తం, రవీందర్, గణేష్,సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్‌ను చెట్టుకు కట్టేసిన వైనం..
### తాళ్లతో చెట్టుకు కట్టి అవమానించిన గ్రామస్తులు...

**సంగారెడ్డి :** దామరగిద్ద గ్రామంలో అమానుషం..హెచ్‌బీఎం ఫైనాన్స్ పేరుతో అంగన్‌వాడీ టీచర్ వసంత కుమారి భర్త ప్రభాకర్ గ్రామంలోని పలువురి వద్ద డబ్బులు తీసుకొని పారిపోయాడు.. ..దీంతో అంగన్ వాడీ టీచర్ ను తాళ్లతో చెట్టుకు కట్టి గ్రామస్తులు అవమానించారు. ఘగనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

## మాచవరంలో మంచినీటి చలివేంద్రం ప్రారంభం

**మాచవరం :** మండల కేంద్రమైన మాచవరం కిరాణా మర్చంట్ బజార్లో గురువారం వివిధ గ్రామాల నుండి వచ్చే బాటసారులకు , స్థానికులకు మినరల్ వాటర్ కూలింగ్ చలివేంద్రాన్ని గురువారం నిర్వాహకులు సూరే నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. గత 30 సంవత్సరాలకు పైగా ఈ చలివేంద్రాన్ని సూరే వెంకట సుబ్బారావు కుమారులు సూర్య వెంకటేశ్వర్లు, సూరే నాగేశ్వరరావు సప్తగిరి ట్రేడర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ చలివేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరేటి వెంకటేశ్వర్లు, రామయ్య, తీరం దాసు, శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు ఘనస్వాగతం

**కరీంనగర్ :** కరీంనగర్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, పుట్టా మధు, దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, సుంకె రవిశంకర్, బిగాల గణేష్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ నాయకులు తుల ఉమ, రాకేష్, కొండూరి రవీందర్ రావు తదితరులు హాజరయ్యారు. తరువాత కేటీఆర్ మరియు ఇతర బీఆర్ఎస్ నేతలు జగిత్యాలకు బయలుదేరారు.

## విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ
### పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి

**మధిర :** అక్షరమే ఆయుధంగా తెలంగాణ బిడ్డలు ప్రపంచంతో పోటీ పడేలా ఎదగాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం మధిర నియోజకవర్గంలోని బోనకల్లులో అమ్మ ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అయన పంపిణీ చేసారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యార్థులు సులభంగా పాఠశాలకు చేరుకునేలా, వారి విద్యాభ్యాసానికి ఎటువంటి అంతరాయం కలగకుండా ముఖ్యంగా బాలికల విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, వారి భవిష్యత్తును మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అంతరాలు లేని ఆదర్శ సమాజం కేవలం విద్యతోనే సాధ్యం. అందుకే రాష్ట్రంలో ఒకేసారి 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. అలాగే ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని అన్నారు. పేద బిడ్డలు ఆకలితో చదువుకు దూరం కాకూడదని జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నాం. విద్యా రంగంలో మేము పెట్టే ప్రతి రూపాయి రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం చేసే గొప్ప పెట్టుబడని అన్నారు..

## డబుల్ బెడ్ రూమ్ పట్టాలు
### పంపిణీ చేసిన మంత్రి పొన్నం

**హైదరాబాద్ :** కార్వాన్ ఎంకే ఎ కన్వెన్షన్ హాల్ లో బహదూర్ పుర ,కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు 2బీహెచ్కే పట్టాలు హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేపారు మంత్రి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు పొందుతున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు. గతంలో చాలా సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూం లు అడిగారు.. మిగిలిపోయిన పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం లు అందిస్తున్నాం. మిగిలిన వారికి కూడా పట్టాలు పంపిణీ చేస్తాం. గత 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశాం..ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే ఎప్పుడైనా రేషన్ కార్డులు పంపిణీ జరుగుతాయి.. ఇది నిరంతర ప్రక్రియ. రేషన్ కార్డులు మాత్రమే కాకుండా తినడానికి యోగ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఆర్థికంగా ప్రజల మీద భారం పడకుండా ఉచిత కరెంట్ తో పాటు ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం. ఇప్పటి వరకు 300 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసి 10 వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారు. మహిళలంతా మెప్మా సంఘాల్లో చేరాలి. ప్రభుత్వం మహిళా సంఘాలకు వేల కోట్లు లోన్లు ఇస్తుంది. హైదరాబాద్ లో గ్రామీణ ప్రాంతాల్లో కంటే మహిళా సంఘాల సభ్యులు తక్కువ ప్రతి ఒకరు మహిళా సంఘం లో చేరాలి.. వారికి లోన్లు ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో పల్లెటూరు లో 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం..5 లక్షల రూపాయలు అందిస్తున్నాం. త్వరలో హైదరాబాద్ లో స్థలం ఉన్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం..ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ లతో సమావేశం ఏర్పాటు చేశాం. స్లమ్స్ అభివృద్ధి చేసి స్థల సేకరణ చేసి ఇందిరమ్మ ఇళ్లు కడతాం. హైదరాబాద్ లో స్థలాలు ఇబ్బంది ఉంది దానికి కార్యాచరణ తీసుకున్నాం.. త్వరలోనే వారికి ఇల్లు ఇస్తాం. కొత్తగా 70 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం. అర్హత ఉన్న వారందరికీ ఎలాంటి వివక్ష లేకుండా డబుల్ బెడ్ రూం పట్టాలు అందిస్తున్నాం. ఎక్కడైనా పొరపాటు జరిగితే మా దృష్టికి తీసుకురండి .. పారదర్శకంగా డబుల్ బెడ్ రూం పట్టాలు అందించబడుతుందని అన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కాళాశాల నూతన భవనం ప్రారంభం
### పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**హైదరాబాద్ :** విద్యా అనే ఆయుధాన్ని సరిగ్గా ఉపయోగించుకుంటే విద్యార్థులు తమ జీవితాలనే కాకుండా ప్రపంచాన్నే మార్చగలరని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. కూకట్పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డితో కలిసి ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కళాశాల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల అభివృద్ధి కోసం పీఎం ఉషపథకం కింద నిధులు మంజూరయ్యాయి దీనిలో భాగంగానే భవన నిర్మాణాన్ని చేపట్టామని అన్నారు. అలాగే డి.ఏం.ఎఫ్.టి నిధుల నుండి 2.8 కోట్లు తో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నేడు కళాశాలలో 1,679 మంది విద్యార్థులతో అందులో 770 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు .విద్యార్థుల కోసం 11 కొత్త తరగతి గదులు, 5 అత్యాధునిక ల్యాబ్లు మరియు మహిళా విద్యార్థినుల కోసం ప్రత్యేక వెయిటింగ్ రూమ్ను సిద్ధం అని చెప్పారు.విద్యార్థుల సౌకర్యార్థం 86 ల్యాప్టాప్లను ఉచితంగా పంపిణీ చేశారు.విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ప్రతిరోజూ వార్తాపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలి.

## రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు
### ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరం ఎంతో మంది కుస్తీ వీరులను అందించిందని మాజీ మంత్రి , ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ నుండి ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ స్థాయిలో రెజ్లింగ్ ఛాంపియన్స్ గా నిలిచారని తెలిపారు. హైదరాబాద్ కోఠి లోని విక్టోరియా ప్లే గ్రౌండ్స్ లో అండర్ 17 హైదరాబాద్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేడు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల యువత ప్రతిభ ఉన్నప్పటికీ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించలేకపోతున్నారని పేర్కొన్నారు. కుస్తీ పోటీల వల్ల శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com